# నేడు ఉమ్మడి జిల్లాకు జననేత రాక

- ఖమ్మం, కొత్తగూడెం ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్న కేసీఆర్
- మధ్యాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం, 2 గంటలకు ఖమ్మంలో సభలు
- రెండు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో తరలిరానున్న జనం
- ఏర్పాట్లను పరిశీలించిన అజయ్, నామా, వద్దిరాజు, వనమా, మధు
- రెండు వారాల వ్యవధిలోనే మూడో సారి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి

ఖమ్మం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటించనున్నారు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రమైన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన పాల్గొననున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మూడు ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ అధినేత హోదాల్లో కేసీఆర్ పాల్గొని ప్రసంగించిన విషయం విదితమే. ఈ సభలు అద్భుతంగా విజయవంతమయ్యాయి. బీఆర్ఎస్ శ్రేణుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సభల్లో కేసీఆర్ స్థానిక అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరిన నేతల వ్యవహార శైలిని తూర్పారబడుతున్నారు. దీంతో సభకు హాజరైన ప్రజల్లో సానుకూల స్పందన లభిస్తోంది.

### మొదట కొత్తగూడెంలో..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ సభలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం పాల్గొననున్నారు. ఇందుకోసం పార్టీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఖమ్మం సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పర్యవేక్షించారు. కొత్తగూడెం సభ ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పరిశీలించారు. సీఎం కేసీఆర్ రానుండడంతో ఆయా జిల్లాల పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కాగా, ఆశీర్వాద సభలకు రెండు నియోజకవర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. ఖమ్మంలోని పలేట్ స్టేడియంలో, కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో హెలీప్యాడ్లను అధికారులు సిద్ధం చేశారు.


ఖమ్మంలో ప్రజా ఆశీర్వాద సభకు సిద్ధమైన ప్రాంగణం


కొత్తగూడెంలో ప్రజా ఆశీర్వాద సభకు ముస్తాబైన సభా వేదిక

### కొత్తగూడెంలో ఏర్పాట్ల పరిశీలన..

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : సింగరేణి కార్మికుల అడ్డా అయిన కొత్తగూడెం గడ్డ మీదకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రానున్నారు. పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ నేత కోనేరు సత్యనారాయణ (చిన్ని) శనివారం పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలను ఇల్లెందు వైపునకు, విజయవాడ వెళ్లే వాహనాలను పాల్వంచ మీదుగా మళ్లించారు.

### కొత్తగూడెంలో వనమా గెలుపు ఖాయం: వద్దిరాజు

తెలంగాణలో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాబోతోందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొత్తగూడెంలో సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న వనమా వెంకటేశ్వరరావు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు.

### సింగరేణి గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం: వనమా

సింగరేణి పురిటిగడ్డ కొత్తగూడెంలో గులాబీ జెండాను ఎగరేస్తామని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జరిగే సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. కొత్తగూడెం, పాల్వంచ జంట పట్టణాలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని అన్నారు.

# మతి భ్రమించే నాపై తుమ్మల వ్యాఖ్యలు

## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎంపీ నామా, పక్కన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''మతి భ్రమించే కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. నగరంలో మేం ఇసుక, మట్టి మాఫియా చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. ఇసుక దందా చేయడానికి ఇక్కడేమైనా గోదావరి, కృష్ణా నదులు ఉన్నాయా..? నగర పరిధిలో ఉన్న నది మున్నేరు. నది నిండా రాళ్లే ఉంటాయి. ఇసుక జాడే ఉండదు. ఆదివారం సీఎం కేసీఆర్ ప్రసంగించనున్న నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలోని చిన్న స్టేజీ తొలగింపుపై రాద్ధాంతం చేస్తున్నారు. కేవలం సీఎం భద్రతా దృష్ట్యానే స్టేజీని తొలగించాల్సి వచ్చింది. సభ పూర్తయిన తర్వాత స్టేజీని దగ్గరుండి తిరిగి నిర్మిస్తాం. నిర్మాణానికి ఇప్పటికే కళాశాల బ్యాంక్ ఖాతాలో రూ.లక్ష జమ చేశాం..'' అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మల బ్యాలెన్స్ తప్పి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశమే నాశనమైందన్నారు. ముందు ఆ విషయాన్ని తుమ్మల అర్థం చేసుకోవాలన్నారు. ఖమ్మంలో మతి భ్రమించి మాట్లాడేవాళ్ల సంఖ్య ఎక్కువ అవుతుందని, వారికి కోసం ప్రత్యేకంగా ఆసుపత్రి నిర్మించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ నేతలను ఉద్దేశించి అన్నారు. ఈ నెల 30న ప్రజలే ఆయనకు ఓట్లతో బుద్ధి చెప్తారన్నారు. సీఎం సీభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలలోపు సభ ముగుస్తుందన్నారు. ప్రజలు ముందుగానే సభ స్థలికి చేరుకోవాలని సూచించారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల సమయంలోనే ప్రజల మధ్యకు వస్తారన్నారు. తర్వాత వాళ్ల ఉనికి కూడా ఉండదన్నారు. వాళ్లది అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశమే ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ మంచిగా ఉంటే అసలు కేంద్రంలో మత విద్వేషాలు సృష్టించే బీజేపీ కేంద్రంలో ఎందుకు అధికారంలో ఉంటుందని ప్రశ్నించారు. ఖమ్మంలో జరిగే సీఎం సభకు ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తనపై లేనిపోని ప్రచారానికి దిగితే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తన ప్రయాణం బీఆర్ఎస్‌తోనే ఉంటుందన్నారు. డిప్యూటీ నగర మేయర్ ఫాతిమా జోహారా మాట్లాడుతూ.. మంత్రి అజయ్‌కుమార్ కృషితోనే నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ శ్వేత, పార్టీ సీనియర్ నేత ఆర్జేసీ కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు కర్నాటి కృష్ణ, జహీర్ అలీ, చింతనిప్పు కృష్ణచైతన్య, బోయినపల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిందెవరో ప్రజలకు తెలుసు

## చెప్పుకునేందుకు ఏమీలేకనే 'తుమ్మల' చిల్లర ఆరోపణలు

## ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లోనూ బీఆర్ఎస్‌దే విజయం

## 'నమస్తే తెలంగాణ'తో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఖమ్మం, నవంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) :ఖమ్మం నియోజకవర్గంలో అభివృద్ధి చేసిందెవరో ఇక్కడి ప్రజలకు తెలుసునని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అదే సమయంలో అరాచకం సృష్టించిందెవరో ఈ నియోజకవర్గ ప్రజలకు ఇంకా బాగా తెలుసునని అన్నారు. కాంగ్రెస్ గానీ, ఆ పార్టీ అభ్యర్థి తుమ్మల గానీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పుకోలేకనే చిల్లర రాజకీయాలకు తెరలేపుతూ పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అయినా ఈ ఆరోపణలన్నింటినీ తాము ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలే తీర్పు చెప్తారని అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనేందుకు సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం ఖమ్మం వస్తున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లు, నియోజకవర్గ అభివృద్ధి వంటి అంశాలపై మంత్రి అజయ్‌కుమార్ శనివారం 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో ఖమ్మం శాసనసభ్యుడిగా గత రెండు పర్యాయాలు తాను గెలుపొందానని అన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల వరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగారని, ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ అధినేతకు గానీ, లేదా ఇతర వ్యవస్థలకు అప్పుడే ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. అప్పుడు కనబడని అవినీతి, అక్రమాలు ఇప్పుడెలా కనబడుతున్నాయని ప్రశ్నించారు. ఇది రాజకీయ దురుద్దేశం తప్ప మరేమీ కాదని అన్నారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకనే వితండవాదాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. అయినా ఈ విషయాలన్నీ ఖమ్మం ప్రజలకు అర్థమయ్యాయని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఖమ్మం నియోజకవర్గంలో రూ.వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. ఆ అభివృద్ధి పనులే ఈ ఎన్నికల్లో తమకు శ్రీరామరక్షగా నిలుస్తాయని అన్నారు. ప్రజల కోసం పనిచేసే వారెవరో, ఎన్నికల కోసమే వచ్చేవారెవరో నియోజకవర్గ ప్రజలు గుర్తించారని అన్నారు. ఖమ్మం ప్రజలు చైతన్యవంతులని, అబద్ధపు ప్రచారాలతో వారిని మభ్యపెట్టలేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు భారీగా తరలిరానున్నారని అన్నారు. ఇప్పటికే మూడు సభలు అద్భుతంగా విజయవంతమయ్యాయని గుర్తుచేశారు. ఆదివారం ఖమ్మం, కొత్తగూడెం జరిగే సభలు కూడా అదేస్థాయిలో విజయవంతమవుతాయని స్పష్టం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున పోటీచేస్తున్న వ్యక్తి చేసిన అభివృద్ధి ఏమిటో, స్థానికుడినైన తాను చేసిన అభివృద్ధి ఏమిటో ఇక్కడి ప్రజలకు తెలుసునని అన్నారు. ఈ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ అభ్యర్థులందరూ విజయదుందుభి మోగించనున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరోసారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రానుందని తేల్చిచెప్పారు.

# రెండోరోజు 14 నామినేషన్లు

- ఇద్దరు అభ్యర్థులు రెండో సెట్ అందజేత
- మొత్తం 24కు చేరిన నామినేషన్ల సంఖ్య
- సుముహూర్తం కోసం ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎదురుచూపు

ఖమ్మం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ రెండో రోజైన శనివారమూ కొనసాగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండోరోజు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగెస్ పార్టీ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు 2వ సెట్ దాఖలు చేశారు. ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా కొంకిమల్ల సాయికుమార్ 2వ సెట్‌ను దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పొంగులేటి శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బైరవబట్ల శ్రీనివాసరావు, షేక్ సిరాజుద్దీన్‌లు నామినేషన్లు వేశారు. మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారత్ పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా కల్యాణ్‌కుమార్, స్వతంత్ర్య అభ్యర్థిగా బొమ్మెర రామ్మూర్తి నామినేషన్ దాఖలు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఆధార్ పార్టీ నుంచి ఆంబోజు సుమలత, భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గం నుంచి బీఎస్పీ తరపున ఎర్ర కామేశ్, ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కోరం కనకయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థిగా భుక్యా మంగీలాల్, పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పాండ్రు హేమసుందర్, అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి మెచ్చా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. మొదటి రోజు 8, రెండో 14 నామినేషన్లు దాఖలు కావడంతో మొత్తం నామపత్రాల సంఖ్య 24కు చేరింది. నామినేషన్లను ఈ నెల 10 వరకు ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించి అభ్యర్థులకు కావాల్సిన సమాచారాన్ని అందించేందుకు ఆయా కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న ప్రధాన అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు మంచి ముహూర్తం కోసం అన్వేషిస్తున్నారు. తమ పేరు బలం, సెంటిమెంటు అంశాలను పరిగణనలోకి తీసుకొని నామినేషన్ దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.